శేరిలింగంపల్లిలో తొమ్మిదేళ్లలో 9వేల కోట్లతో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాంధీ



సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గం బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సభ్యులు

- బెంగళూరుకు ధీటుగా ఐటీ కేంద్రంగా అభివృద్ధి
- బస్తీల్లో ప్రతి ఓటరును కలవాలి వివరించాలి.. రిపోర్టు అందించాలి
- ఐటీ శాఖ మంత్రి ,బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు స్పష్టీకరణ
- మియాపూర్‌లో బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి బూత్ కమిటీల సమావేశం

మియాపూర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేశారని ఐటీ శాఖ, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు పేర్కొన్నారు.శేరిలింగంపల్లిలో తొమ్మిదిన్నరేళ్లకాలంలో రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేశామని, మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీల సమావేశాన్ని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ అధ్వర్యంలో మియాపూర్‌లోని నరేన్ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు ధీటుగా ఐటీ కేంద్రంగా శేరిలింగంపల్లి ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు.

పొత్తు ఎవరితో లేదు..

ఎన్నికలలో పొత్తు ఎవరితో లేదు, కేవలం ప్రజలతోనే పెట్టుకున్నం, దేవున్ని మొక్కుతున్నం, ప్రజలనే నమ్ముకున్నం.. గెలుపు మనదే, శేరిలింగంపల్లిలో మరోసారి గులాబి జెండా ఎగురవేస్తామని, అందుకూ అందరూ కృషి చేయాలన్నారు.

చిట్టి కథలతో ఆకట్టుకున్న కేటీఆర్

జేబులో కడక్ వంద రూపాయల నోటు పెట్టుకొని వెళుతుంటే రోడ్డుపై చిల్లర పైసలు పడి ఉంటే వాటిని తీసుకోవడానికి వంగితే జేబులో ఉన్న కడక్ వంద నోటు పడిపోతది దాంతో ఇటు జేబులో ఉన్నది, అటు కింద ఉన్నవి కూడా లేకుండా పోతవి గుర్తుంచుకోవాలని కేటీఆర్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండోరోజు రెండు నామినేషన్లు



ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఆకాష్ శ్రీరామోజు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రెండోరోజు రెండు నామినేషన్లు వేశారు. దీంతో నామినేషన్ల సంఖ్య మూడుకు చేరింది. శనివారం చందానగర్ డివిజన్ కైలాష్‌నగర్‌కు చెందిన ఆకాష్ శ్రీరామోజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే శేరిలింగంపల్లి డివిజన్‌లోని నెహ్రూనగర్‌కు చెందిన మహ్మద్ పాషా నామినేషన్ వేశారు. ఇద్దరు పదిమంది ప్రతిపాదికులతో నామినేషన్ వేసినట్లు ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పటాన్‌చెరులో మూడు..

జంగ్ తెలంగాణ 2023

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో రెండో రోజు..మూడు నామినేషన్‌లు దాఖలయ్యాయి. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన దేవయ్య పొలాది ఎస్‌యూసీఐ సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా పటాన్‌చెరు పట్టణం గౌతమ్‌నగర్‌కు చెందిన గణపురం వేణుగోపాల్ ,రామచంద్రాపురం ఎస్‌ఎస్ కాలనీకి చెందిన వరికుప్పల యాదగిరి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజాకు పత్రాలు అందజేశారు.

నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గ నామినేషన్ కేంద్రాన్ని శనివారం ఎన్నికల వ్యయ పరిశీలకులు జయకర్ (ఐఆర్‌ఎస్) సందర్శించారు. అభ్యర్థులకు సంబంధించిన అకౌంట్స్ వివరాలు ఏ విధంగా నమోదు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుండి ఈ నెల 2వ తేదీ వరకు ఖర్చును ఆయా పార్టీ భరిస్తుందని, 3వ మూడో తేదీ నుంచి ఖర్చు అభ్యర్థి ఖాతాలోకి వస్తుందని తెలిపారు. అనంతరం సిబ్బంది కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న ఫార్మాట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వీఎస్టీ, ఎఫ్ఎస్టీ టీంలు పాల్గొన్నాయి.

బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్

భాగ్యనగర్ కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీకే టికెట్ వస్తుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ తెలిపారు. కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. శనివారం ఆయన ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు బీజేపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు, బీజేపీ నాయకులు, మహిళా మోర్చా, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తాం..



మార్తాండనగర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరికెపూడ గాంధీ

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్ సమక్షంలో శనివారం కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంను రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. యువత అంతా బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని, వారికి అండగా నిలబడతామన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో కృష్ణ యాదవ్, ఎంపీ జావేద్, గౌతమ్ యాదవ్, సాయికుమార్, రాఘవేంద్ర, ధర్మారావు, బుధారాం ఉన్నారు.

ఇంటింటి ప్రచారం

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి ఆరికెపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపిద్దామని అరికెపూడి శ్యామలాదేవి పిలుపునిచ్చారు. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలనీల్లో కాంగ్రెస్ ప్రచారం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ కూతురు హారిక ఇంటింటికి తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. శనివారం డోయన్స్ కాలనీ, గంగారంలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు.



దోయన్స్ కాలనీలో ప్రచారం చేస్తున్న హారిక

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సుమధుర సంగీత స్వరధార సంగీత విభావరి, తిల్లాన ఆర్ట్స్ అకాడమి గురువు మాధవి మారెళ్ళపూడి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో మంగళం, జయ జయ స్వామిన్, ఆండాల్ కౌత్వం, నటనమాడిన ,భరో కృష్ణయ్య, సింహసన స్తుతి, కీర్తన, గోపబాల, తిల్లాన తదితర అంశాలను అభా, ఆన్వీ, ఆర్య, అజ్ఞ, చేతన, సాయి, వేదాంశీ, సమృద్ధి, స్వేచ్ఛ తదితరులు పాల్గొన్నారు. సంగీత కళాకారులు గరుడగమన, సువ్వి సువ్వి, జయ జయ కీర్తనలను ఆలపించారు. వీరికి తబలా జైకిషన్, కీబోర్డు వేణు సంగీత సహకారాన్ని అందించారు.



వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారి అష్టవింశ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు జగద్గురు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వామిలచే అష్టవింశ బ్రహ్మోత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం 10.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, మధ్యాహ్నం 12 గంటలకు తీర్థప్రసాదాలు అందించారు.



స్వరూపానందేంద్ర స్వామిని కలిసిన సీఎస్ శాంతికుమారి

హఫీజ్‌పేట్ : వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి జగద్గురు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వాములను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. రాజశ్యామల అమ్మవారి వస్త్రాలను పీఠాధిపతుల చేతులమీదుగా ఆమె అందుకున్నారు. పీఠాధిపతులను కలిసిన వారిలో రాజ్యసభ మాజీ సభ్యులు ఉన్నారు.

నేడు బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం బాల బృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 'ఆటిట్యూడ్ ఆఫ్ గ్రాటిట్యూడ్' అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 9 ఏళ్ళ నుంచి 14 ఏళ్ళ లోపు విద్యార్థులు పాల్గొన వచ్చని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040 23001234లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు ఆర్.సుభాష్‌బాబు వేసిన చిత్రాలను ప్రొఫెషియన్సీ విత్ జీల్ పేరిట శనివారం చిత్రప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను మాజీ మంత్రి ఎం.ఎం.పి.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తాయని కొనియాడారు. ఈనెల 8వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

హెచ్‌సీయూలో పూలు, పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం



భూమిని చదును చేస్తున్న వాలంటీర్లు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఆయుర్వేద మొక్కలు, పండ్లు, పూల మొక్కలను నాటి పెంచేందుకు అవసరమైన భూమి చదును చేసే కార్యక్రమాన్ని శనివారం ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ వరలక్ష్మి పర్యవేక్షణలో వలంటీర్లు, విద్యార్థులు ప్రారంభించారు. ఆయుర్వేద మూలికలు, పూలు, పండ్ల మొక్కలను నాటి వాటిని రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలను హెచ్‌సీయూ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆదిత్యశ్రీ, కుసుమ, మధులత, కె వెంకటదాస్, ఉద్యానవన శాఖ అధికారులు మల్లేశం, శంకర్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సమాఖ్య ఆత్మీయ సమావేశం

రాయదుర్గం: శేరిలింగంపల్లి పట్టణ దివ్యాంగుల సమాఖ్య ఆత్మీయ సమావేశం శనివారం ఎమ్మెల్యే గాంధీ నివాసంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని గాంధీ హామీ ఇచ్చారు.సీఎం కేసీఆర్ దివ్యాంగుల పెన్షన్లను పెంచడంపై అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి పట్టణ సమాఖ్య ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఫకీర్, కోశాధికారి లింగమ్మ, ప్రతినిధులు వెంకటేష్, షబ్బీర్, హబీబ్ పాల్గొన్నారు.

అన్నమయ్య స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం తెలుగువన్.కామ్ రేడియో జాకి హిమబిందు ఆధ్వర్యంలో బిజిబెస్ లర్నింగ్ సెంటర్ ద్వారా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, స్తోత్ర పఠనం గురువులతో పాటు శిష్యులు సునిల్, విఖ్యాత్, ఇందిరా, మిహిర, తన్విక, సమయ, మీర, చక్రిక, అశ్విని, శ్రీరామచంద్ర తదితరులు పాల్గొని కీర్తనలను ఆలపించారు. కళాకారులకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు.

కార్మిక రంగానికి ఆత్మబంధువు సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం రాష్ట్రంలోని పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి యాజమాన్యాలు, అటు కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రశంసించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వాల హయాంలో నిత్యం లాకౌట్లు, విద్యుత్ కోసం ధర్నాలతో పారి శ్రామిక రంగం దినదిన గండంగా ఉండేదని, కేసీఆర్ నాయకత్వంలో కార్మికులు ఆనందంగా ఉంటున్నారన్నా రు. శుక్రవారం రాత్రి స్థానిక జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన చిన్న తరహా పరిశ్రమల సమాఖ్య ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్మిక రంగం నుంచి వచ్చిన తనకు కార్మికులు, యాజమాన్యాల సమస్యలపై అవగాహన ఉందన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమం మరింత ముందుకు వెళ్లాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నగేశ్ కురుమ, శ్రీధర్ చారి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మతతత్వ పార్టీకి ఓటేస్తే అంధకారమే

పటాన్‌చెరు: పోరాడి సాధించుకున్న తెలంగాణలో మతతత్వ పార్టీలకు చోటు లేదని, పొరపాటున ఓటు వేస్తే ప్రజలకు అంధకారమే మిగులుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీజేపీ కౌన్సిలర్లు సాయి కిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, కోఆప్షన్ సభ్యుడు రంగారెడ్డి, సీనియర్ నాయకులు నారాయణ యాదవ్, ఉదయ్, పవన్ యాదవ్ తదితరులు మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మతతత్వ నినాదమే అజెండాగా సాగుతున్న బీజేపీకి డిపాజిట్లు సైతం దక్కబోవన్నారు. రాష్ట్రానికి కేటాయించే నిధులతో పాటు మెడికల్ కళాశాల కేటాయింపుల్లోనూ బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఓటుకు నోటు కేసులో నిందితుడుగా ఉన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నేడు రేటెంత రెడ్డిగా మారిపోయారని విమర్శించారు. మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్ వేణుపాల్ రెడ్డి, సతీశ్ బాలమణి రత్నం, బీరప్ప, శైలజ పుండరీకం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు: బీఆర్ఎస్ పార్టీలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేరికల జోరు కొనసాగుతూనే ఉంది. తాజాగా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట, పటాన్‌చెరు మండలం ముత్తంగి జై భీమ్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కిష్టారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్, మహేందర్, బాబురావు, రవి, యూసుఫ్, సాయికుమార్, ముత్తంగి జై భీమ్ కాలనీకి చెందిన విఠల్, ఆంటోని, పెంటయ్య, ఆనంద్, దుర్గయ్య తదితరులు పార్టీలో చేరారు. జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, పటాన్‌చెరు వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, కిష్టారెడ్డిపేట సర్పంచ్ కృష్ణ, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ఏకగ్రీవ మద్దతు

కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని, అభివృద్ధి సంక్షేమాన్ని చూసి అన్ని సంఘాలు పార్టీకి మద్దతు పలకడం సంతోషకరంగా ఉందన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని అరవ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అరవ వడ్డెర సంఘం అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం ఎమ్మెల్యే జీఎంఆర్‌ను ఘనంగా సన్మానించి ఏకగ్రీవ మద్దతు ప్రకటించారు. సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా శనివారం నాయకులు ప్రచా రం నిర్వహించారు. జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు హుస్సేన్, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. గుమ్మడిదల మండలంలో జరిగిన అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. మహిపాల్‌రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆర్యవైశ్య మహాసభ మద్దతు



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహాసభ మహిళలు

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య మహాసభ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. ఎన్నికలలో విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని మహాసభ ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజ్జెల యోగానంద్‌కు టికెట్ ఇవ్వాలని ఆందోళన

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి టికెట్‌ను గజ్జెల యోగానంద్‌కు ఇవ్వాలని ఆయన మద్దతుదారులు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. శనివారం యోగానంద్ అనుచరులు పెద్ద సంఖ్యలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మీ సమస్య.. మా పోరాటం కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఉన్నారని, గజ్జెల యోగానంద్ ఫౌండేషన్ ద్వారా జాబ్ మేళలు, సదస్సులు నిర్వహించారని గుర్తు చేశారు.



నాంపల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న యోగానంద్ మద్దతుదారులు